సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 20 । జూన్ । 2025



అవకాశాలు ఓపెన్

రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా టెన్త్, ఇంటర్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది.




మూడు కుటుంబాల్లో విషాదం

పిఠాపురం మండలం విరవ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

II లో

డెల్టాలకు 10,400 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 3,600, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 5 వేలు కలిపి మొత్తం 10,400 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 2,666 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

వీఆర్‌ఓ పోస్టుల తగ్గింపు అన్యాయం



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఓ పోస్టులు తగ్గించడం అన్యాయమని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్‌ఓల సమస్యలపై అసోసియేషన్ జిల్లా నేతలు డీఆర్‌ఓ టి.సీతారామమూర్తికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సానా శ్రీను, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వాడ్రేవు లక్ష్మీప్రసన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగి అప్పలనాయుడు మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్‌ఓలను మిగులుగా చూపడం సరికాదని అన్నారు. రేషనలైజేషన్‌తో నిమిత్తం లేకుండా పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన ప్రతి గ్రామానికి ఒక వీఆర్‌ఓను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ అధికారులతో సంప్రదించకుండా, రాష్ట్ర వీఆర్‌ఓ సంఘాల నాయకులతో చర్చించకుండా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారుల సలహా మేరకు జీఓ నంబర్ 1, 2, 3, 4, 5 ఏకపక్షంగా విడుదల చేయడాన్ని తప్పు పట్టారు. దీనిని పునఃపరిశీలించాలన్నారు. సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ నుంచి వీఆర్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని, అర్హులైన వారికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.

యోగా పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16, 17 18 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన తండ్రీకొడుకులు ప్రతిభ చూపారు. యోగా గురువు కక్రి నాగ వెంకట శ్రీధర్ యోగా షార్ట్ ఫిల్మ్ పోటీల్లో 35 సంవత్సరాలు పైబడిన విభాగంలో యోగా షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ద్వితీయ, యోగా ఫొటోగ్రఫీ పోటీలో తృతీయ స్థానాలు సాధించారు. ఆయన కుమారుడు కార్తీక్ రామచంద్ర 10 నుంచి 18 సంవత్సరాల విభాగంలో ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రథమ, షార్ట్ ఫిల్మ్ పోటీల్లో తృతీయ స్థానాలు సాధించాడు. వారిద్దరినీ కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం అభినందించారు. వారికి అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ అధికారులు కూడా పాల్గొన్నారు.

లేట రైట్ రైట్..

- నాగులకొండ అటవీ ప్రాంతంలో కొండలు పిండి
- చినబాబు కనుసన్నల్లో మైనింగ్
- మెట్టలో సహజ వనరుల దోపిడీ
- గిరిపుత్రులకు గుండు సున్నా
- ఉపాధీ లేదు.. ఉద్యోగాలూ లేవు



గిరిజనాపురం అటవీ ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం అండతో వేల కోట్ల రూపాయల విలువైన సహజ వనరులు సరిహద్దులు దాటి తరలిపోతున్నాయి. ప్రత్తిపాడు మండలంలో ఉప ప్రణాళికా ప్రాంతమైన వంతాడ సమీపంలోని గిరిజనాపురం నాగులకొండ అటవీ ప్రాంతంలో అక్రమార్కులు కొండలు పిండి చేస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందలకొద్దీ టిప్పర్లతో గ్రావెల్, లేటరైట్ యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు.

ఏం జరిగిందంటే..

గిరిజనాపురం అటవీ ప్రాంతంలో సుమారు 250 ఎకరాల్లో 2014లో లేటరైట్ ఖనిజం తవ్వకాలకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఒక ప్రైవేటు కంపెనీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అప్పటి నుంచీ 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ.. అధికార టీడీపీ పెద్దల అండదండలతో అక్కడ పెద్ద ఎత్తున లేటరైట్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగాయి. అప్పట్లో అక్రమార్కులు టన్నులకు టన్నుల లేటరైట్ తరలించుకుపోయి రూ.కోట్లు కొల్లగొట్టారు. అధికారం అండ చూసుకుని నిబంధనలతో పని లేకుండా అడ్డగోలుగా తవ్వేస్తున్నా మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూసే సాహసం చేయలేకపోయారు. నాడు ప్రారంభంలో ఆరేడు వాహనాలతో నడిచిన దందా చివరాఖరుకు 25 వాహనాలతో వందలాది ట్రిప్పులు వేసే స్థాయికి చేరుకుంది. గత ఎన్నికల్లో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో ఇప్పుడు మళ్లీ గిరిజనాపురం పరిసర ప్రాంతాల్లోని కొండలను పిండి చేసేస్తున్నారు. లేట్‌రైట్‌ను తవ్వి తీసి ప్రత్తిపాడు మండలం ఆరళ్లధార డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. దీంతోపాటు తొండంగి మండలం రావికంపాడు వద్ద మరో డంపింగ్ యార్డు కూడా ఉంది. రావికంపాడు యార్డు నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా టన్నుల కొద్దీ లేటరైట్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఇందులో కొంత ఐరన్ ఓర్ కూడా ఉందనే ఆరోపణలున్నాయి.

రోజుకు 440 ట్రిప్పులు

ఈ రెండు డంపింగ్ యార్డులకు రోజుకు ఒక్కో టిప్పర్‌తో సుమారు 20 ట్రిప్పుల చొప్పున లేటరైట్ తరలిస్తున్నారు. ఈవిధంగా రోజుకు 25 వాహనాలతో తక్కువలో తక్కువ 440 ట్రిప్పుల వరకూ లేటరైట్ తరలిస్తున్నారని అంచనా. నిబంధనలు తుంగలో తొక్కి ఒకో టిప్పర్‌లో 30 టన్నులకు మించి తరలిస్తున్నారు. గిరిజనాపురం అటవీ ప్రాంతంలో నాలుగు ఆధునిక యంత్రాలతో లేటరైట్ తవ్వుతున్నారు. గతంలో రెండు క్రషర్లు పని చేస్తే ఇప్పుడు మరో రెండింటిని జోడించారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో టిప్పర్లు భారీ లోడుతో దుమ్ము రేపుతూ వెళుతుంటే ప్రమాదాలు జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చినబాబు కనుసన్నల్లోనే విశాఖకు చెందిన అధికార పార్టీల కీలక ప్రజాప్రతినిధి అనుచరులు అనుమతికి మించి కొండలను పిండి చేసేస్తున్నారని మండిపడుతున్నారు.

అడవి బిడ్డల ఆందోళన

ఇంత భారీ స్థాయిలో మైనింగ్ జరుగుతున్నా వంతాడ, గిరిజనాపురం ప్రాంతాల గిరిజనులకు ఒరిగిందేమీ లేదని గిరిజన సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. కొండలనే నమ్ముకున్న తమ నోటి దగ్గర కూడు కూడా కబళించేస్తున్నారని అడవి బిడ్డలు ఆందోళన చెందుతున్నారు. పోడు వ్యవసాయానికి గిరిపుత్రులను అడ్డుకునే అటవీ శాఖ.. రూ.కోట్ల విలువైన లేటరైట్‌ను పరిమితికి మించి అడ్డగోలుగా తరలించుకుపోయేందుకు మాత్రం అనుమతిస్తోందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. మైనింగ్‌లో రెండు మూడు వందల మంది పని చేస్తున్నా తమకు ఉపాధి కల్పించడం లేదని స్థానిక గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి కోసం స్థానిక గిరిజన యువత మైదాన ప్రాంతంలో చేపలు, రొయ్యల చెరువులు, రెస్టారెంట్లలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ దుర్భరంగా బతుకుతున్న పరిస్థితులున్నాయి. మైనింగ్ జరిపే క్రమంలో నాగులకొండ మీద నివసించే అడవి బిడ్డలకు అనేక హామీలు ఇచ్చారు. గోకవరం పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో ప్రతి కుటుంబానికీ ఇంటి నిర్మాణానికి తోడ్పాటు, గ్రామాభివృద్ధికి ఏటా రూ.20 లక్షలు ఇస్తామని, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని వాగ్దానం చేశారు. ఆ హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని గిరిజనులు మండిపడుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట టిప్పర్‌లోకి లేటరైట్ లోడింగ్



లేటరైట్‌తో క్యూ కట్టిన టిప్పర్లు

పోడు భూములకు పట్టాలివ్వాలి

వంతాడ పరిసర అటవీ ప్రాంతంలోని గిరిజనులకు 30 ఏళ్లుగా పోడు భూముల పట్టాలు ఇవ్వడం లేదు. ఆ భూములను ప్రైవేటు సంస్థలకు లీజులకు ఇస్తూ రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను రాత్రి, పగలు అనే తేడా లేకుండా తవ్వేసి, తరలించుకుపోతున్నారు. ఫలితంగా వ్యవసాయ భూములతో కళకళలాడాల్సిన భూములు భారీ గోతులతో అగాధాల్లా మిగులుతున్నాయి. ఈ గోతుల్లో పడి మనుషులు, జంతువులు మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి.

– కొసిరెడ్డి గణేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సీపీఐ (ఎంఎల్ – వినోద్ మిశ్రా)

హామీలు అమలు చేయడం లేదు



గ్రామ సమీపంలో లేటరైట్ మైనింగ్ జరుగుతున్నా మా గ్రామానికి ఒరిగిందేమీ లేదు. అప్పట్లో గ్రామ సభలో గిరిజనులకిచ్చిన హామీలు అమలు చేయడంలో లీజుదారు విఫలమయ్యారు. విద్య, వైద్య సదుపాయాలతో పాటు మౌలిక వసతులు కల్పించకపోవడంతో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. మైనింగ్ సంస్థలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– ఉల్లి తాతారావు, ఆదివాసీ గిరిజన సంఘం, వంతాడ, ప్రత్తిపాడు మండలం

హేతుబద్ధంగా సచివాలయ కార్యదర్శుల బదిలీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పూర్తి హేతుబద్ధంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పని చేస్తున్న సచివాలయ కార్యదర్శుల బదిలీలను కాకినాడ, ఏలూరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యాన చేపడతారని చెప్పారు. జిల్లా పంచాయతీ, రెవెన్యూ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గత ఐదేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులను బదిలీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఈమేరకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు హేతుబద్ధత కలిగి ఉండేలా సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు ఈ నెల 22 నుంచి 24 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవలసి ఉంటుందన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకూ బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. దివ్యాంగులు, కారుణ్య నియామకాలు పొందిన వితంతు ఉద్యోగులు, దివ్యాంగులు, ఉద్యోగులుగా ఉన్న దంపతులు, అదనపు పోస్టుల్లో పని చేస్తున్న వారిని కొన్ని పరిమితులకు లోబడి బదిలీ చేస్తారని కలెక్టర్ ప్రశాంతి వివరించారు.

రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు శనివారం నుంచి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభించనున్నట్లు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కాప్, దివ్యాంగ అభ్యర్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వారు శుక్రవారం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చొప్పున చెల్లించాలన్నారు. సీట్ల కేటాయింపు జూలై 7న పూర్తవుతుందన్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకూ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చన్నారు. జూలై 1న ఆప్షన్లు తిరిగి మార్చుకోవచ్చన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 4 నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు, 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల, ఆదాయ



ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్‌లు కూడా సమర్పించాలని నాగేశ్వరరావు సూచించారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు

తేదీ	ఏ ర్యాంకు నుంచి	ఏ ర్యాంకు వరకూ
21	1	15,000
22	15,001	32,000
23	32,001	50,000
24	50,001	68,000
25	68,001	86,000
26	86,001	1,04,000
27	1,04,001	1,20,000
28	1,20,001	చివరి ర్యాంకు వరకూ

వచ్చే నెల 5న లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులతో పలు అంశాలపై చర్చించారు. సునీత మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను అధిక సంఖ్యలో లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అదనపు జిల్లా న్యాయస్థానాల్లో మోటారు వాహన ప్రమాదాల కేసులను పరిష్కరించి, బాధితులకు పరిహారం అందించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు భూ, ఆస్తి వివాదాలు, రెవెన్యూ, మునిసిపాలిటీ కేసులు, రాజీ పడదగిన అన్ని ఇతర కేసులనూ పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత. చిత్రంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అభ్యర్థులు తమ అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శుక్రవారం నుంచి జూలై 15వ తేదీ రాత్రి 11.55 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి జూలై 17వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సునీల్ కుమార్ సూచించారు.

రయ్ రయ్..

- చివరి దశకు చేరుకున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు
- దేవరపల్లి – ఖమ్మం మధ్య 162 కిలోమీటర్ల మేర నిర్మాణం
- రూ.4,609 కోట్లతో నిర్మిస్తున్న కేంద్రం
- విశాఖ – హైదరాబాద్ మధ్య తగ్గనున్న దూరం
- 8 నెలల్లో అందుబాటులోకి..

దేవరపల్లి: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో మూడు కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తి కావలసి ఉంది. 2022 ఏప్రిల్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నాటికే దీని నిర్మాణం పూర్తి కావలసి ఉండగా, అధిక వర్షాలు, భూసేకరణలో ఇబ్బందుల వల్ల జాప్యం జరిగింది. ఈ హైవే మరో 8 నెలల్లో అందుబాటులోకి రానున్నదని అధికారులు చెబుతున్నారు.

ఇదీ ప్రయోజనం

ప్రస్తుతం విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి 13 గంటల సమయం పడుతోంది. అదే గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా అయితే కేవలం 8 గంటల్లోనే హైదరాబాద్ చేరుకోవచ్చని హైవే అధికారులు చెబుతున్నారు. తెలంగాణలోని ఖమ్మం నుంచి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వరకూ దాదాపు 162 కిలోమీటర్ల పొడవున పూర్తిగా పచ్చని పంట పొలాల మధ్య నుంచి ఈ హైవే నిర్మిస్తున్నారు. దీని నిర్మాణం వల్ల విశాఖ నుంచి హైదరాబాద్‌కు విజయవాడ వెళ్లకుండానే నేరుగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. విశాఖ – హైదరాబాద్ మధ్య సుమారు 125 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. దేవరపల్లి వద్ద తల్లాడ హైవేకి 2 కిలోమీటర్ల దూరాన డైమండ్ జంక్షన్ వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రారంభమవుతుంది. విశాఖపట్నం వైపు నుంచి వచ్చే వారు 16వ నంబర్ జాతీయ రహదారిపై దేవరపల్లికి చేరుకుని, అక్కడి నుంచి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా హైదరాబాద్‌కు సులువుగా చేరుకోవచ్చు. ఈ రహదారి దాదాపు ఎక్కడా మలుపులు లేకుండా సాగుతుంది.



దేవరపల్లి - ఖమ్మం మధ్య నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే


రూ.4,609 కోట్లతో..

దేవరపల్లి నుంచి ఖమ్మం వరకూ రూ.4,609 కోట్ల వ్యయంతో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 53.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.2,200 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు కోసం 1,996 ఎకరాల భూములు సేకరించారు. మన రాష్ట్రంలో రెండు ప్యాకేజీలుగా దీని పనులు జరుగుతున్నాయి. మొదటి ప్యాకేజీ కింద మొత్తం 27.4 కిలోమీటర్ల పనులూ పూర్తయ్యాయి. రెండో ప్యాకేజీలో 29.4 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టగా, ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పొంగుటూరు వద్ద 3 కిలోమీటర్లు మినహా మిగిలిన పనులు పూర్తి చేశారు. పొంగుటూరుకు చెందిన రైతు కోర్టుకు వెళ్లడంతో మూడెకరాల భూసేకరణ నిలిచిపోయింది.

ఎన్నో ప్రత్యేకతలు

- ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి 8 చోట్ల ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేశారు. తెలంగాణలోని ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లితో పాటు మన రాష్ట్రంలోని తిరువూరు, జంగారెడ్డిగూడెం, గుర్వాయిగూడెం, దేవరపల్లి వద్ద మాత్రమే ఈ హైవే పైకి చేరుకునేలా అనుసంధాన రహదారులు నిర్మించారు.
- నాలుగుచోట్ల టోల్‌ప్లాజాలు, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేశారు.
- పుట్లగట్లగూడెం – గుర్వాయిగూడెం వద్ద జంక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి అటు ఖమ్మం, ఇటు దేవరపల్లి, మరోవైపు జంగారెడ్డిగూడెం చేరుకోవచ్చు. మొత్తం 83 ఎకరాల విస్తీర్ణంలో ఈ జంక్షన్ ఏర్పాటవుతోంది.
- ఖమ్మం నుంచి దేవరపల్లి మధ్య 8 టోల్‌ప్లాజాలు, 51 మైనర్, 9 మేజర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.
- చెన్నై – కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ హైవే, ప్రస్తుతం ఉన్న తల్లాడ హైవే (316డి) దేవరపల్లి వద్ద కలుస్తున్నాయి. ఈ మూడు హైవేలూ కలిసేచోట నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఔటర్ రింగ్ రోడ్డు (ట్రమ్‌పుట్) నిర్మించారు.
- గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగు పడటమే కాకుండా, నిమ్మ, అరటి, కోకో, జీడిగింజల వంటి వ్యవసాయ ఉత్పత్తులను సుదూర ప్రాంతాలకు రవాణా చేయడం సులభతరమవుతుంది.

ఆ 3 కిలోమీటర్ల నిర్మాణానికి అడ్డంకులు



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మన రాష్ట్రంలో రెండో ప్యాకేజీ కింద చేపట్టిన పనులు పొంగుటూరు వద్ద 3 కిలోమీటర్ల మేర భూసేకరణ సమస్యతో నిలిచిపోయాయి. దీనిపై తీర్పును 2024 ఫిబ్రవరిలో న్యాయస్థానం రిజర్వు చేసింది. ఈ వారంలో తీర్పు వచ్చే అవకాశం ఉంది. ఆ వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఈ మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సుమారు 8 నెలలు పడుతుంది.

– సురేంద్రనాథ్, ప్రాజెక్టు డైరెక్టర్, భారత జాతీయ రహదారుల సాధికార సంస్థ, రాజమహేంద్రవరం



దేవరపల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా



గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి 16వ నంబర్ జాతీయ రహదారికి వెళ్లే మార్గం



దేవరపల్లి వద్ద నిర్మించిన ట్రమ్‌పుట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



ఘటనా స్థలంలో మోటార్ బైక్, స్కూటీని పరిశీలిస్తున్న ఏఎస్సై

పెదపూడి: మోటార్ సైకిల్, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఏఎస్సై శ్రీనివాసు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట మున్సిపాల్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుడిపూడి శ్రీనివాస్ (51) తన బంధువులను పరామర్శించేందుకు గురువారం రాయవరం మండలం కురకాళ్లపల్లి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో పెదపూడి మండలం చింతపల్లి గ్రామంలోని ఇటుకల బట్టీ వద్ద రామచంద్రపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జి.మామిడాడ నుంచి స్కూటీపై వస్తూ ఎదురుగా వస్తున్న మోటార్ బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో పెదపూడి సామాజిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్కూటీపై వెళుతున్న వారికి గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదుపై ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు రెండ్రోజుల్లో జీతాలు

అన్నవరం ఆలయ ఈఓ సుబ్బారావు ఆదేశం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని 349 మంది పారిశుధ్య కార్మికులకు 'మే' నెల జీతాలను రెండ్రోజుల్లో చెల్లించాలని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఆదేశించారు. జీతాలు వరుసగా మూడో నెల కూడా ఆలస్యం అవడంపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'వేతనాల ఆలస్యం రివాజే !' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఈఓ అధికారులను ప్రశ్నించారు. పారిశుధ్య కాంట్రాక్టర్ రూ.59 లక్షలకు బిల్లు ఇన్వాయిస్ ఈ నెల 14న ఇచ్చాడని, దాని ఆధారంగా బిల్లు సిద్ధం చేసి బుధవారం ఆడిట్‌కు పంపించగా అక్కడ క్వెరీ పడిందని, దానికి ఆన్సర్ చేసి మళ్లీ ఆడిట్‌కు పంపించామని అధికారులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఆడిట్ క్లియర్ అయి వచ్చిన వెంటనే బిల్లు మొత్తాన్ని కాంట్రాక్టర్ అకౌంట్‌కు జమ చేసి వెంటనే పారిశుధ్య సిబ్బందికి చెల్లించే ఏర్పాటు చేస్తామని వారు వివరించారు. జూన్ నెల జీతాలు చెల్లించేందుకు సకాలంలో కాంట్రాక్టర్ బిల్లు ఇన్వాయిస్ పంపేలా చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం దరఖాస్తులను కోరుతున్నామని జిల్లా సమన్వయ అధికారి ఎస్.శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి నుంచి ఆయా పాఠశాలల్లో ఈ దరఖాస్తుల స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష కేంద్రం బాలికలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సాంబమూర్తినగర్, కాకినాడ, బాలురకు అంబేడ్కర్ గురుకుల పాఠశాల లక్ష్మీనరసాపురంలో నిర్వహిస్తామన్నారు.

అవకాశాలు ఓపెన్

- ఇంటి దగ్గరే పది, ఇంటర్ చదివే అవకాశం
- ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ
- జూలై 31 తుది గడువు



సార్వత్రిక విద్యాలయం విద్యార్థులు (ఫైల్)

రాయవరం: రోజు వారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పది, ఇంటర్ ఇంటర్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. రెగ్యులర్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు పూర్తి చేయలేక పోయిన వారు ఉత్తీర్ణత పొందిన వాటిలోంచి గరిష్ఠంగా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకుని మూడు సబ్జెక్టులతో మాత్రమే పరీక్షలు రాసే విధంగా రూపొందించిన ఈ కోర్సులకు ప్రవేశ ప్రకటన వెలువడింది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు దరఖాస్తులు ఈ నెల 12 నుంచి ఆహ్వానిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 256 కేంద్రాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అక్రియేటెడ్ ఇనిస్టిట్యూషన్స్(ఏఐ) 256 కేంద్రాలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 81, కాకినాడ 98, తూర్పు గోదావరిలో 77 ఏఐ సెంటర్లు ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు అధ్యయన కేంద్రం వద్ద దరఖాస్తు ఏఐ కోర్డినేటర్ వద్ద ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశ పెట్టింది.

ప్రవేశాలు ఇలా..

ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా జూలై 31వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200ల అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు. ఎస్సెస్సీలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్+ అడ్మిషన్ ఫీజుతో రూ.1,150 చెల్లించాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అపరాధ రుసుం ఎస్సెస్సీ, ఇంటర్‌కు రూ. 200 చొప్పున ఫీజుకు అదనంగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజులకు అదనంగా మీసేవా చార్జీలు రూ.36 చెల్లించాలి.



ఓపెన్ స్కూల్ ఎంబ్లమ్

కనీసం 24 కాంటాక్టు తరగతులు

అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 తరగతులకు హాజరైన వారిని మాత్రమే పరీక్షలకు అనుమతిస్తారు.

10లో ప్రవేశం పొందాలనుకునే వారు గ్రూపు-ఎలో ఇంగ్లిషుతో పాటుగా తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బిలోని గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్‌లో గ్రూపు-ఎలో ఇంగ్లిషుతో పాటుగా తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బి ప్రధాన సబ్జెక్టుల నుంచి మూడు సబ్జెక్టులతో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంది. సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. అలా ఉత్తీర్ణత పొందకపోతే తిరిగి అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. 10 పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఇంటర్‌లో ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకోవచ్చు.

మార్కుల బదలాయింపు

రెగ్యులర్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంది. పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు ఎస్సెస్సీలో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు రూ.150ల చొప్పున అదనంగా చెల్లించాలి.

అర్హతలు ఇవే..

- ఎస్సెస్సీ కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలి.
- గరిష్ఠ వయోపరిమితి ఉండదు.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, ఎస్సెస్సీ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

ఏటా ప్రవేశాలు పెరుగుతున్నాయి



అర్హతలు, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాల సంఖ్య ఏటా పెరుగుతుంది.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

లారీ ఢీకొని వ్యాపారి మృతి



ప్రమాద స్థలంలో శివానందరెడ్డి మృతదేహం

కడియం: మండలంలోని వేమగిరి వద్ద జాతీయ రహదారిపై గురువారం లారీ ఢీకొని అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి సత్తి శివానందరెడ్డి (43) మృతి చెందారు. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వ్యాపారం నిమిత్తం శివానందరెడ్డి ఉదయం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా వేమగిరి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి శివానందరెడ్డి చక్రాల మధ్యకు వెళ్లిపోవడంతో ఆయనను కొద్దిదూరం లారీ ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. దీంతో శరీరంపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కడియం ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన క్షతగాత్రులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి
- ఆటోను ఢీకొట్టిన ఐషర్ వ్యాన్
- ఒకరికి తీవ్ర గాయాలు



కాలదారి జారబాబు, గాలింక కన్నబాబు, చినబాబు (ఫైల్)

పిఠాపురం: మండలంలోని విరవ వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పిఠాపురం మండలం మల్లాంకు చెందిన కాలదార రాజబాబు ఆటో డ్రైవరు, గుద్దాటి చినబాబు, కాలదార రమేష్, విరవకు చెందిన గాలింక కన్నబాబు మల్లాంలో జరిగిన ఒక శుభకార్యంలో పాల్గొన్నారు. శుభకార్యం పూర్తయిన వెంటనే తమ ఆటోలో సరదాగా అలా తిరిగి వద్దామంటూ మల్లాం నుంచి విరవ బయలుదేరారు. ఆటో విరవ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న కాలదార రాజబాబు (40) అక్కడికక్కడే మృతి చెందగా గాలింక కన్నబాబు, కాలదార రమేష్, గుద్దాటి చినబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుత్రికి తరలించారు. మార్గమధ్యలో గాలింక కన్నబాబు (43) మృతి చెందాడు. గుద్దాటి చినబాబు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పిఠాపురం రూరల్ ఎస్సై జాన్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రాజబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఒకరు ఆటో డ్రైవరు కాగా మిగిలిన ముగ్గురు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు.

తల్లికి వందనం సొమ్ము రాలేదని..

విరవకు చెందిన గాలింక కన్నబాబు హైదరాబాద్‌లో కూలి పని చేస్తుంటాడు. అయితే ఇటీవల తన కుమార్తెకు తల్లికి వందనం పథకంలో డబ్బు రాలేదని ఇంటి దగ్గర నుంచి ఫోన్ రావడంతో మంగళవారం రాత్రి విరవ వచ్చాడు. గురువారం ఉదయం మల్లాంలో తన బంధువుల ఇంటి వద్ద జరిగిన శుభకార్యంలో పాల్గొనడానికి వెళ్లి తన బంధువులైన కాలదార రాజబాబు, గుద్దాటి చినబాబు, కాలదార రమేష్‌లతో కలిసి ఆటోలో విరవ వస్తుండగా ప్రమాదానికి గురయ్యి మృత్యువాత పడ్డాడు. కన్నబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆనందం ఆవిరి

అప్పటి వరకు శుభకార్యంతో ఆనందంగా గడిపిన ఆ కుటుంబాల్లో ఈ రోడ్డు ప్రమాదం ఒక్కసారిగా విషాదం అలుముకుంది. తమ వారు ప్రమాదానికి గురయ్యారన్న విషయం తెలిసిన వెంటనే తీవ్ర ఆందోళనతో కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలివెళ్లారు.

అర్చకుడు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో అతి ప్రాచీన ముక్తేశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీన పట్టపగలే చోరీ జరిగిన విషయం తెలిసిందే. స్వామివారికి చెందిన 70 గ్రాముల బంగారు, 1,100 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో ఆలయ పరిసరాల్లో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. క్రైం టీం, పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. విధి నిర్వహణలో బాధ్యతా రహితంగా వ్యవహరించారంటూ ఆలయ అర్చకుడు అయినవిల్లి శివరామకృష్ణ, ఉద్యోగులు జగతా వెంకట నాగ పుల్లయ్యానాయుడు, కుడుపూడి నాగ సత్యదుర్గాప్రసాద్‌లకు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పండూరులో భారీ చోరీ

- ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు ఊరు వెళ్లడంతో దొంగతనం
- సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ



పండూరులో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న ఎస్సై మూర్తి

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు గ్రామంలో గరగా విజయ శ్రీభాస్కరరావు(పెదకాపు) ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు లోపలకు ప్రవేశించి బీరువాలోని విలువైన బంగారు, వెండి ఆభరణాలు దోచుకుపోయారు. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పండూరు రామాలయం వీధిలో నివాసం ఉంటున్న పెదకాపు భార్య వెంకట పద్మ, ఆమె చిన్న కుమారుడితో కలిసి పెద్దాపురం మండలం గోరింట పుట్టింటికి ఈ నెల 17న వెళ్లారు. అదే రోజు పెదకాపు వైజాగ్ వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం వెంకట పద్మ, చిన్న కుమారుడు వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కంగారు పడి పరిశీలించారు. తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లిన చోరులు బీరువాలోని సుమారు 51 గ్రాముల బంగారు, 1,200 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు కొంత మొత్తంలో నగదు దోచుకుపోయినట్టు గుర్తించారు. జరిగిన ఘటన గురించి తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు తిమ్మాపురం స్టేషన్ అదనపు ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు వివరాలు సేకరించారు. బుధవారం రాత్రి చోరీ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కాగా చోరీ మొదటి అంతస్తులో జరగగా గ్రౌండ్ ఫ్లోర్‌లో పెదకాపు పెద్ద కుమారుడు ఉంటున్నాడు. పెద్ద కుమారుడు ఇంట్లో ఉండగానే పై ఫ్లోర్‌లో చోరీ జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మూర్తి తెలిపారు.

అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

- గ్రామస్తుల ఆందోళన
- శ్మశానాన్ని తవ్వేసి బాటల నిర్మాణం



మట్టి తవ్వకాలను నిలిపివేయాలని ఆందోళన నిర్వహించిన గ్రామస్తులు

పి.గన్నవరం: మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ఇసుక, మట్టి దిబ్బలు కనపడితే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. అక్రమంగా మట్టి, ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఇప్పటికే ఊడిమూడిలంక, యర్రంశెట్టివారిపాలెం లంక, పెదకందాల పాలెం, మానేపల్లిలంక తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక, మట్టిని తరలించి దోచుకుంటున్నారు. తాజాగా నాగుల్లంక గ్రామం వద్ద శ్మశానాన్ని తవ్వి లంకలోకి బాటలు నిర్మించారు. దీంతో గురువారం గ్రామస్తులు పార్టీలకు అతీతంగా అక్కడికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. టిప్పర్ల రాకపోకల కోసం శ్మశానం మీదుగా ఏర్పాటు చేసిన బాటలను తొలగించాలని, అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. గతంలో సంభవించిన వరదల్లో తమ గ్రామం వద్ద వశిష్ట నది ఎడమ ఏటిగట్టుకు గండి ఏర్పడి తీవ్రంగా నష్టపోయామని గ్రామస్తులు వివరించారు. తమ గ్రామ ఏటి గట్టుకు కనుచూపు మేరలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం రావిలంక నుంచి తువ్వ మట్టిని తవ్వేందుకు అక్రమార్కులు కొన్ని రోజుల నుంచి బాటలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. శ్మశానం మీదుగా బాట ఏర్పాటు ఏర్పాటు చేయడంతో సమాధుల నుంచి ఒక మృతదేహం బయటకు వచ్చిందని గ్రామస్తులు వివరించారు. ఇక్కడ అక్రమ తవ్వకాలు చేపడితే తమ గ్రామంతో పాటు, కనకాయలంక కాజ్ వేకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులు, క్రిస్టియన్లు వినియోగించుకునే శ్మశాన వాటిక కనుమరుగై పోతుందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యల్లమెల్లి చిట్టిబాబు, గ్రంధి వెంకటేశ్వరరావు, చిట్టినీడి రంగసాయి, బొక్కా ఏడుకొండలు, కారుపల్లి శ్రీను, మంగం శ్రీను, పాలూరి శ్రీను, ఆరుమిల్లి రాంబాబు, చింతా రవి, భీమాల వెంకటేశ్వర రావు, చిలకపాటి శ్రీను, మంగం రవి, గ్రంధి బాల మురళీ, కాండ్రేగుల ఆనందబాబు, కొటికలపూడి వెంకటేశ్వర రావు, పితాని ఏడుకొండలు, నూకల విశ్వేశ్వరరావు, మానుకొండ సందీప్ పాల్గొన్నారు.

పదవులు పొందిన వారికి అభినందనలు



అనపర్తిలో వైఎస్సార్ సీపీ నాయకులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీలోని వివిధ విభాగాల్లో పదవులు పొందిన మండల నాయకులను మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. ఈ మేరకు గురువారం అనపర్తిలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అనపర్తి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గొలుగూరి సురేంద్రరెడ్డి, మండల పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా సత్తి సుబ్బారెడ్డి, మండల విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా సబ్బెళ్ల నాగిరెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలోని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌షాపులో...



చోరీ జరిగిన సెల్ షాపును పరిశీలిస్తున్న సీఐ, వేలిముద్ర నిపుణులు

- రూ.ఐదు లక్షల విలువైన ఫోన్లు
- రూ.80 వేల నగదు అపహరణ

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలో ఉన్న వినాయక మొబైల్ షాపులో దొంగలు చొరబడి రూ.ఐదు లక్షల విలువైన సెల్‌ఫోన్లు, కౌంటర్‌లోని రూ.80వేల నగదు చోరీ చేసినట్టు షాపు నిర్వాహకులు దిలీప్, ముఖేష్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు షాపు షట్టర్‌ను తొలగించి లోనికి చొరబడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ ఎ.కృష్ణభగవాన్, వేలిముద్ర నిపుణులు ఘటనా ప్రదేశంలో వివరాలు సేకరించారు.

22న దేవరపల్లిలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలోని క్రీడామైదానంలో ఈ నెల 22న ఫుట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షులు వి.రాజశేఖర్ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కలర్ జిరాక్స్‌లు తీసుకురావాలని ఆయన తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2012 జనవరి ఒకటి నుంచి 2013 డిసెంబరు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి ఒకటి నుంచి 2012 డిసెంబరు 31 మధ్య జన్మించి ఉండాలని ఆయన తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.



ఫ్యాషన్

గాజులది ఆభరణాలను మించిన స్థాయి.
సంప్రదాయం, వేడుక ఏదైనా మణికట్టు చుట్టూ మెరిసే వ్యక్తిగత శైలి.
వివాహిత మహిళలకు గాజులలో శ్రేయస్సు, ప్రేమ మెండుగా కలిసి ఉంటాయి.
అందుకే, పాత మట్టి గాజులైనా వాటి స్థానాన్ని వీడి పోవు.
ఆధునిక మహిళ ఆ గాజులను కొత్త అల్లికలు, రంగులు, శైలులతో మణికట్టును కనికట్టు చేస్తోంది.
వేడుకల కోసం రకరకాల ఆభరణాలతో వార్డ్‌రోబ్‌ను కొంగొత్తగా నిర్మిస్తున్నా
రాబోయే పండుగ రోజుల్లో చేతుల లుక్‌ను పెంచుకోవాలనుకునే వారికి
సేకరణలో పూర్తిగా చోటు సంపాదించడానికి కావల్సినన్ని జతల గాజులు దొంతర్లుగా సిద్ధంగా ఉన్నాయి.
వాటిలో ట్రెండ్‌లో ఉన్న ముఖ్యమైన ఐదు రకాలు
గాజుల పెట్టెలో తప్పక ఉండాల్సిందే!

మణికట్టు... కనికట్టు



ప్రతిరోజు గ్లామర్ ...
మినిమలిస్ట్ గోల్డ్ కడా బ్యాంగిల్

బంగారు కడా గాజులు నిన్నటి తరం తప్పని ఆభరణం. బరువైన, చంకీ కడాలు ఇప్పుడు అందరికీ నచ్చడం లేదు. కొత్త తరం వెర్షన్ సొగసైనది, తేలికగా ఉండేది కోరుకుంటుంది. ఆధునిక టచ్‌తో కూడిన సాధారణ, లైట్‌వెయిట్ బంగారు కడాలను ఎంపిక చేసుకోవచ్చు. అల్లికలు, చివరలు ఓపెన్‌గా ఉండేవి, ఒకటి లేదా రెండు రేఖాగణిత నమూనాలు ఉన్నవి.. రోజువారీ దుస్తులకు సరైనవి. పూజల నుండి సంప్రదాయ శైలి వరకు కొన్ని సన్నని గాజులు, బోల్డ్ సింగిల్ కడా ధరిస్తే రెండు విధాలుగా ఆకట్టుకుంటుంది. రిచ్ లుక్ కోసం ఒక మందపాటి కడాను రెండు సున్నితమైన బంగారు గాజులతో జత చేయవచ్చు. ఫ్యామిలీ ఈవెంట్స్, కార్యాలయ పూజలు, రోజువారీ సల్వార్ సూట్‌కు కూడా ఇవి బాగుంటాయి.

పోల్కీ గాజులు - భారతీయ వివాహానికి తప్పనిసరి

బాలీవుడ్ వధువుల ఎంపికతో పోల్కీ బ్యాంగిల్స్ తిరిగి వచ్చాయి. గతంలో కంటే మరింత పెద్ద స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. అన్‌కట్ డైమండ్స్‌తో హెరిటేజ్ ఆకర్షణతో కూడిన ఈ గాజులు రాచకళను సృష్టిస్తున్నాయి. వివాహ వేడుకలకు ఇవి ప్రత్యేకం అని చెప్పవచ్చు. వేడుకలో ఎంచుకున్న డ్రెస్‌కు తగిన కలర్, డిజైన్‌ను బట్టి గాజుల తయారీ ఉంటుంది. ఇవి ఎప్పటికీ ఎవర్‌గ్రీన్ సెట్స్ అని చెప్పవచ్చు. వారసత్వ సంపదకు అర్థమైనవి, ఏదైనా పండుగ దుస్తులకు తక్షణ గ్లామ్‌ను జోడిస్తాయి. పోల్కీ గాజులను మెరిసేలా అలంకరించాలి. దీనికి కాంబినేషన్‌గా పోల్కీ చోకర్, చెవిపోగులతో జత చేయచ్చు. వివాహాలు, కర్వా చౌత్, యానివర్సరీ పార్టీలు, రాణిలా భావించాలనుకునే ఏదైనా కార్యక్రమంలో ఈ పోల్కీ గాజులను ధరించవచ్చు.



మీనాకారీ గాజులు - రంగుల ఆనందం

రంగుల రంగులతో ఉండే గాజులను ఎవ్వరైనా ఇష్టపడతారు. మీనాకారీ గాజుల ప్రకాశవంతమైన ఎనామిల్ వర్క్, అద్భుతమైన డిజైన్లకు పేరొందాయి. పూల నుండి నెమళ్ల వరకు ఇవి సంస్కృతి, రంగుల పరిపూర్ణ మిశ్రమం. దుస్తుల రంగులకు తగినవి ఎంపిక చేసుకోవాలంటే మీనాకారీ గాజులు సరైన ఎంపిక. పండుగలు, వేడుకలలో అలంకరణ బోరింగ్‌గా ఉండకుండా ఇవి సంప్రదాయ శక్తిని తెస్తాయి. లెహంగా లేదా చీర బార్డర్ కి సరిపోయే రంగు గాజులను ఎంచుకోవచ్చు. బోనాలు, నవరాత్రి, దీపావళి, తీజ్, హల్దీ ఫంక్షన్ల సమయాల్లో ధరించే దుస్తులకు ఈ గాజులు అదనపు ఆకర్షణను తెస్తాయి. వీటిలో వేడుకను బట్టి, ఫాటో బ్యాంగిల్స్ జత చేయడం మరో ఆకర్షణ.



స్టేట్‌మెంట్ కఫ్ బ్యాంగిల్స్ - ఆధునిక శైలి

ప్రతి గాజూ సంప్రదాయకంగా ఉండనవసరం లేదు. మీదైన స్టైల్ స్టేట్‌మెంట్ చూపించాలనుకున్నప్పుడు కఫ్ బ్యాంగిల్స్ సరైనవి. వీటిలో ముత్యాలు, స్టోన్స్, ఎనామెల్ లేదా వెడల్పుగా మెటల్ కఫ్‌లను ఎంచుకోవచ్చు. ఇండో-వెస్ట్రన్ శైలికి ఇవి మీకు అనుకూలంగా ఉంటాయి. స్పెషల్‌గా, సాధారణ దుస్తులను కూడా ఫ్యాషన్-ఫార్వర్డ్‌గా కనిపించేలా ఈ కఫ్ బ్యాంగిల్స్ చేస్తాయి. మణికట్టు మీద చంకీ కఫ్ ధరించి, మరొకటి సాధారణమైనది వేసుకోవాలి. ఇది స్టైల్‌ను బ్యాలెన్స్ చేస్తుంది. స్టేట్‌మెంట్ పీస్‌గా మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. కాక్‌టెయిల్ పార్టీలు, ఫ్యూజన్ దుస్తులు లేదా మీరు మీ స్టైల్ గేమ్‌ను ప్రదర్శించాలనుకునే ఆఫీస్ గ్యాదరింగ్స్ కూడా ఈ కఫ్ బ్యాంగిల్స్ సరైన ఎంపిక.





ట్రెండ్స్ మారుతాయి. కానీ గాజులు ఎప్పటికీ ఉంటాయి. వివాహ జ్ఞాపకాలలో, పండుగలలో, రోజువారీ ఆచారాలలో, వ్యక్తిగత ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లో కూడా భాగంగా నిలుస్తాయి. చక్కగా అలంకరించిన గాజుల చేతులు అద్భుతంగా కనిపించడమే కాదు, అవి మీదైన ప్రత్యేకతను ఎదుటివారికి పరిచయం చేస్తాయి. ఇక ఇప్పుడు మీరు గాజులు ధరించడానికి వివాహిత మహిళ మాత్రమే కాదు, నేటి అభివృద్ధిలో వెలిగే ఒక స్టైల్ ఐకాన్ కూడా!

● న్యూస్‌మేకర్

సాహిత్యమే పిల్లలకు మంచి చెప్పాలి

- సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కార విజేత గంగిశెట్టి శివకుమార్

'మేము చదువుకునే సమయంలో రోజూ మోరల్ ఇన్‌స్ట్రక్షన్ (ఎం.ఐ.) అనే క్లాస్ ఉండేది. పిల్లల్ని కూచోబెట్టి సార్లు ఒక కథ వినిపించి అందులోని నీతి వివరించేవారు. అసలు నేడు పిల్లలకు ఇంటా బయటా మౌలిక భావాలు ఎవరు చెబుతున్నారు? పెద్దవాళ్లకా టైమ్ లేదు. మరి పిల్లలకు పరోపకారం చేయాలని, దేశభక్తి కలిగి ఉండాలని, మూఢ భావాలు ఉండకూడదని, అందరి పట్లా సమ భావన కలిగి ఉండాలని, ఆధునిక భావాలు కలిగి ఉండాలని... ఎవరు చెప్పాలి? బాల సాహిత్యమే చెప్పాలి. పిల్లల చేత పుస్తకాలు చదివిస్తే తప్ప ఇవాళ వారిలో కనిపిస్తున్న దుర్లక్షణాలు పోవు' అన్నారు గంగిశెట్టి శివ. 71 ఏళ్ల శివకుమార్ దాదాపు యాభై ఏళ్లకు పైగానే బాల సాహిత్యం రాస్తున్నారు. 2025 సంవత్సరానికి గాను ఆయన పుస్తకం 'కబుర్ల దేవత'కు బాల సాహిత్యం కేటగిరిలో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా 'సాక్షి ఫీచర్స్ ప్రతినిధి'తో శివకుమార్ సంభాషణ...

● బాల సాహిత్యంలోకి ఎలా వచ్చారు?

శివకుమార్: మాది నెల్లూరు జిల్లా రాపూరు. మా నాన్న పోస్టాఫీసులో పని చేసేవారు. తరుచూ బాల మిత్ర, చందమామ ఇంటికి తీసుకొచ్చేవారు. ఆ రోజుల్లో వాటిని చేత్తో తాకడమే పెద్ద సంబరం. 13 ఏళ్ల వయసులో అవి చదివి అలా నేను కూడా కథలు రాయాలనుకునేవాణ్ణి. 14వ ఏట మొదటి కథ పోస్ట్ చేశాను. అప్పటి నుంచి పిల్లల కథలు రాసి పత్రికలకు పంపించడం మొదలుపెట్టాను.

● కథల్లో పిల్లలకు ఏం చెబుతుంటారు?

జ: నేను కొడవటిగంటి కుటుంబరావు గారి ఏకలవ్య శిష్యుణ్ణి. ఆయనలాగే పిల్లల్లో ఆలోచన, విచక్షణ పెరిగే సాహిత్యం ఉండాలని కోరుకుంటాను. మంత్రాలు, తంత్రాలు కాకుండా హేతువుకు ప్రాధాన్యం పెరిగేలా రాశాను. బాలసాహిత్యం చదివిన పిల్లలు తమకు తాము మేలు చేసుకోవాలి, సమాజానికి మేలు చేయాలి. ఇవి చేయడానికి వీలు కల్పించని సాహిత్యం మంచి బాల సాహిత్యం కాదు. ఇవాళ్టి పిల్లలు రేపటి పౌరులు మాత్రమే కాదు మహా పురుషులు కావాలి. కాని ఏ మహాపురుషుడి గురించి వీరు తెలుసుకుంటున్నారు... చదువుతున్నారు? మనందరం గాంధీ, నెహ్రూ గాథల నుంచి కదా ఇన్‌స్పైర్ అయ్యింది?

● ఇప్పటి వరకూ ఎన్ని పుస్తకాలు రాశారు?

జ: పది పుస్తకాలు రాశాను. కథలు వందల కొద్దీ రాశాను. నేను బి.ఎస్సీ చదివి తెలుగు ఎం.ఏలోకి వచ్చాను భాష మీద ప్రేమతో. ఇవాళ ఎంతమంది అలా వస్తున్నారు? భాష, సాహిత్యాలకు బడులలో ప్రాధాన్యం లేదు. మార్కులు, ర్యాంకులు ప్రధానమయ్యాయి తల్లిదండ్రులకు. వ్యక్తిత్వం మార్కులతో, ర్యాంకులతో రాగలదా? వ్యక్తిత్వ నిర్మాణమే దేశ నిర్మాణం అని తెలుసుకోవాలి. ఇవాళ టీచర్ల మీద దాడి చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులను ఆదరించని పిల్లలు ఏ సంస్కృతికి ప్రతిఫలం? ఇలాంటి పిల్లలు గొప్ప సాహిత్యం, నైతిక విలువలు పాదుకొలిపే పుస్తకం ఒక్కటి కూడా చదివి ఉండరు. వీరి చేత చదివించని పెద్దలు వీరి నుంచి మంచి నడవడికను మాత్రం ఆశిస్తారు. అదే విచిత్రం.

● 'కబుర్ల దేవత' పుస్తకానికి మీకు పురస్కారం వచ్చింది. 'కబుర్ల దేవత' కథ పేరు. అందులో ఏముంది?

జ: కొంతమంది మాటలు చెప్పి బతగ్గలరు. అదొక స్కిల్. అది అందరికీ రావాలని లేదు. అంతమాత్రాన పనిమంతుడికి విలువ తగ్గదు. పని తెలిసినవాడు తన పని తాను చేసుకెళ్లాలి. దానికీ ఫలితం ఉంటుంది. మాట్లాడేవాళ్లను చూసి బెదరిపోవద్దు అనే వ్యక్తిత్వ వికాస కోణంలో ఆ కథ పిల్లలకు చెప్పాను.

● మీకు నచ్చిన బాల సాహిత్యకారులు?

జ: కలువకొలను సదానంద గారు మంచి సాహిత్యం రాశారు. పిల్లలకు సులభంగా అర్థమయ్యే శైలి వారిది. కె.సభా కూడా మంచి బాల సాహిత్యం రాశారు.

● మీ ఇతర వివరాలు

జ: నేను నెల్లూరు జిల్లాలోనే వివిధ చోట్ల ఉపాధ్యాయునిగా పని చేసి రిటైర్ అయ్యాను. మ అబ్బాయి చెన్నైలో, అమ్మాయి నెల్లూరులో స్థిరపడ్డారు. రిటైరయ్యాక కూడా ఒక స్కూల్ బాధ్యతలు చూస్తున్నాను. పిల్లలను కంట్రోల్ చేయడం ఎంత కష్టంగా ఉందో చెప్పలేను. పిల్లలు ఇలా ఎందుకు ఉన్నారో అందరూ కలిసి ఆలోచించాలి. పిల్లల బాధ్యత సమాజం బాధ్యత అనుకోనంత వరకూ బాలల వికాసం పరిపూర్ణంగా జరగదు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 19న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,710
బంగారం (22 క్యారెట్లు)	91,290
వెండి	1,08,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,11,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,800
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,22,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	95,430
వెండి	1,08,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,000
బంగారం (22 క్యారెట్లు)	90,160
వెండి	1,07,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,01,070
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,22,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా


ఐడియా ఉందా?



● కీర్తి సురేష్, సుహాస్

కీర్తి సురేష్, సుహాస్ ముఖ్య తారలుగా, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. వసంత్ మరింగంటి రాసిన కథతో, ఐవీ శశి దర్శకత్వంలో రాధిక లావూ నిర్మించిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూలై 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం 'ఉప్పు కప్పురంబు' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ''నిన్న మన స్మశానంలో తిరుగుతుంటే నాకో విషయం తెలిసిందండీ... ఇక నాలుగు స్థలాలే ఖాళీగా ఉన్నాయి. అంటే మన ఊర్లో నాలుగు శవాలు పూడ్చిపెట్టడానికి మాత్రమే చోటుంది. అదీ విషయం', 'నాకైతే ఏమీ తెలియదు... మీ దగ్గర ఏమైనా ఐడియా ఉందా?, సమాధి చోటు కోసం ఎవరైనా కొట్టుకుంటారా? అందరూ వచ్చి నాక్కావాలి నాక్కావాలి అంటే..' అన్న డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. 1990లో చిట్టిజయపురం అనే కల్పిత గ్రామంలో ఈ సినిమా కథనం సాగుతుందని విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ– ''ఉప్పు కప్పురంబు'లో ఆదర్శవాది, దృఢనిశ్చయం గల అపూర్వ అనే అమ్మాయి పాత్రలో నటించాను. గ్రామీణ సంస్కృతుల నేపథ్యంలో ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది'' అని తెలిపారు. ''ఈ సినిమాలో చిన్నా అనే పాత్రలో కనిపిస్తాను. చిన్నా ఒక విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. అదేంటో సినిమాలో చూడండి. ఈ సినిమాలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి'' అని అన్నారు సుహాస్.

రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే..!



● దివ్యేందు

ఇక్కడున్న ఫొటో చూశారుగా..! రామ్ బుజ్జి బాల్ ఎగరేసి, ఎంత కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నాడో! మరి... రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే ఎలా ఉంటుంది? అతని బౌలింగ్‌లో పెద్ది బ్యాటింగ్ చేస్తే ఏం జరుగుతుంది? అనే సీన్స్‌ను థియేటర్స్‌లో చూడాల్సిందే. రామ్‌చరణ్ టైటిల్ రోల్ చేస్తున్న మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా గురువారం దివ్యేందు శర్మ జన్మదినం సందర్భంగా 'పెద్ది'లో రామ్ బుజ్జి పాత్రలో తను నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'మిర్జాపూర్, ది రైల్వేమెన్' వంటి వెబ్ సిరీస్‌లతో పాటు హిందీలో 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ, 2016 ది ఎండ్' వంటి సినిమాల్లో నటించిన దివ్యేందుకు 'పెద్ది' తొలి స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది.

ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా - అక్కినేని నాగార్జున



''కుబేర' సినిమాలో నాది బిలియనీర్ పాత్ర అని అందరూ అనుకుంటున్నారు. కానీ, నాది మధ్య తరగతి వ్యక్తి ప్రాత. సీబీఐ ఆఫీసర్‌గా కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య నా పాత్ర ఉంటుంది. నా క్యారెక్టర్‌ని శేఖర్ కమ్ముల చాలా అద్భుతంగా రాశారు. నా పాత్రలో చాలా ఛాయలుంటాయి.. అదే విధంగా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌కి మంచి చాన్స్ దక్కింది'' అని అక్కినేని నాగార్జున తెలిపారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున పంచుకున్న విశేషాలు.

● 'కుబేర' లాంటి మంచి కథలు రావాలంటే స్టార్ హీరోలు కలిసి పని చేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు కలిసి చేశాను. గతంలో నాన్నగారు(ఏఎన్నార్), ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు గార్లు... ఇలా చాలా మంది కలిసి మల్టీస్టారర్ సినిమాలు ఎన్నో చేశారు. పైగా శేఖర్ కమ్ముల గారితో పని చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. 'ఆనంద్' సినిమా నుంచి ఆయన ఏంటో, ఆయన సినిమాలు ఎలా ఉంటాయో మనందరికీ తెలుసు. ఆయన కథల్లో సామాజిక సంబంధిత అంశాలు ఉంటాయి. అందుకే శేఖర్‌గారి సినిమాలు నాకు బాగా ఇష్టం. తన సినిమాల్లో సామాజిక అంశాలతో పాటు ఇతర వాణిజ్య అంశాలు కూడా ఉంటాయి.

● 'కుబేర'లో మంచి యునిక్ పాయింట్ ఉంది. ప్రస్తుత సమాజానికి ఆ పాయింట్ చాలా దగ్గరగా ఉంటుంది. అలాగే అద్భుతమైన సంఘటనలు ఉంటాయి. అవన్నీ కూడా నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాలో మంచోళ్లు ఉన్నారు, చెడ్డోళ్లు ఉన్నారు. బిలియనీర్, మధ్యతరగతి, బిలో పావర్టీ లైన్... ఇలా మూడు సొసైటీల మధ్య క్లాష్ ఈ సినిమాలో ఉంటుంది. వైవిధ్యమైన ఈ కథలో రెగ్యులర్ స్క్రీన్ ప్లే ఉండదు... రొటీన్ క్యారెక్టర్స్ కనిపించవు. ఇందులో ఏ పాత్ర కూడా హీరో, హీరోయిన్ అనడానికి లేదు. తెరపై మేము కాకుండా ప్రేక్షకులకు అన్నీ పాత్రలే కనిపిస్తాయి. ఇలాంటి సినిమాలు చేయడానికి ధైర్యం కావాలి.

● ఈ సినిమాలో నా ఇమేజ్‌కి తగ్గట్టు స్క్రిప్ట్‌లో శేఖర్‌గారు ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేశారు. నేను కూడా ఎలాంటి మార్పులు అడగలేదు.. మార్చితే కథ మారిపోతుంది. మా ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శేఖర్‌గారితో పని చేశారు. 'కుబేర'లో చేయడానికి ఆయన వర్కింగ్ స్టైల్ గురించి నాగ చైతన్యని అడిగాను. ఎందుకంటే రీసెంట్‌గా తను 'లవ్ స్టోరీ' మూవీ చేశాడు కాబట్టి. 'శేఖర్‌గారి వర్కింగ్ స్టైల్ చాలా బాగుంటుంది. మీరు చాలా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పాడు. 'కుబేర'లో నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్స్... అన్నీ కూడా కొత్తగా శేఖర్‌గారి శైలిలో ఉంటాయి. తమిళ్ వెర్షన్‌లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను.

● ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయాడు.. అద్భుతంగా నటించాడు. సెట్స్‌లో మా బాండింగ్ చాలా బాగుండేది. షాట్ గ్యాప్‌లో సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఈ చిత్రంలో రష్మికా మందన్న అద్భుతంగా నటించింది. ఫైనల్ కాపీ చూశాక, ఫోన్ చేసి 'కుబేర'లో నువ్వే స్టార్' అని చెప్పాను.. తను చాలా సంతోషపడింది. సునీల్ నారంగ్, రామ్మోహన్‌గార్లు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా చాలా ప్యాషన్‌తో నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి చాలా ముఖ్యం. పాటలు కూడా సందర్భానుసారంగా వస్తాయి. కెమెరామేన్ నికేత్ బొమ్మిరెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.

● ప్రస్తుతం చాలా మంది పాన్ ఇండియా సినిమా అంటూ నాలుగైదు భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్స్ వేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని సినిమాలూ దానికి సరిపోవు. స్టార్ హీరోలు, స్టార్ డైరెక్టర్, బిగ్ ప్రొడక్షన్ హౌస్ కలిసి పెద్ద సినిమా చేసినప్పటికీ కథలో విషయం లేకుంటే ఉపయోగం లేదు. ఈ మధ్య అలాంటి భారీ బడ్జెట్ సినిమాల్ని కూడా ప్రేక్షకులు తిరస్కరించారు. కానీ 'కోర్ట్' లాంటి చిన్న సినిమా సూపర్ హిట్ అయింది. నా దృష్టిలో ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా. అలాగే మంచి కథ ఉన్నదే పెద్ద సినిమా.

● నా కెరీర్‌లో వందో సినిమాని తమిళ దర్శకుడు కార్తీక్‌తో చేస్తున్నాను. 'కింగ్ 100' అని వర్కింగ్ టైటిల్ పెట్టాం. ఈ చిత్రాన్ని మా అన్నపూర్ణ స్టూడియోస్‌పై నిర్మిస్తాం. అయితే వందో సినిమా వంద కోట్ల బడ్జెట్‌తో రూపొందనుందనే వార్తల్లో నిజం లేదు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో నేను నటించడం లేదు. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి పూర్తి స్థాయిలో ఓ సినిమా చేయాలని మా అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఇప్పుడప్పుడే అలాంటి సినిమా వచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే మా ముగ్గురికి సరిపడే కథతో ఇప్పటివరకూ ఎవరూ నన్ను కలవలేదు.

● నటుడిగా దాదాపు నలభై ఏళ్ల కెరీర్ నాది. ఎన్నో పాత్రలు చేశాను. అయితే ఫలానా పాత్ర చేయాలనే కల నాకు లేదు. నాకు నచ్చిన, వైవిధ్యమైన పాత్రలు చేసుకుంటూ వెళుతుంటాను. రజనీకాంత్‌గారి 'కూలీ' సినిమాలో ప్రాపర్ విలన్‌గా కనిపిస్తాను. లోకేశ్ కనగరాజ్ చక్కగా తీశారు. అయితే 'కూలీ'లోలా మళ్లీ విలన్ పాత్ర చేయను. క్యారెక్టర్ నచ్చితే కామెడీ కూడా చేస్తాను. ఏం చేసినా నాకు కొత్తగా అనిపించాలి. నేను నటించిన 'శివ' సినిమాని రీ రిలీజ్ చేయబోతున్నాం. 4కే పనులు పూర్తయ్యాయి. ఇంకా బెటర్ ఎఫెక్ట్స్ కోసం వర్క్ జరుగుతోంది. ఒక రీల్ చూశాను.. క్వాలిటీ అద్భుతంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లలో సినిమాకి చర్చలు జరిగాయి. అదే విధంగా 'బ్రహ్మాస్త్ర 2' లోనూ నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అయాన్ ముఖర్జీ చెప్పారు.


మధ్యతరగతి సోలోబాయ్



● జ్యోతీ బాయ్, శ్రీరామ్ నాయక్, గౌతమ్ కృష్ణ

గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. నవీన్ కుమార్ దర్శకత్వంలో వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. భారతదేశం ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో అమరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయించారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ – ''మధ్య తరగతి కుటుంబాలను ఆధారంగా చేసుకుని తీసిన చిత్రం ఇది. నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది ప్రేక్షకులే. అందుకే నా వంతుగా ఏదో ఒకటి చేయాలని సమవర్తి అనే ట్రస్టు ద్వారా నాకు వచ్చే ప్రతి సంపాదనలోనూ సగం ఈ ట్రస్టుకు అందజేయాలని నిర్ణయించుకున్నాను. 'బిగ్‌బాస్' షోతో వచ్చిన డబ్బులో సగం ఆ ట్రస్టు ద్వారా ముందుగా ఒక లక్ష రూపాయలు మురళీ నాయక్‌గారి కుటుంబానికి అందజేస్తున్నాను'' అన్నారు. ''ఈ చిత్రం హీరో గౌతమ్ రెమ్యునరేషన్ తీసుకోకపోవడంతో పాటు కొంత డబ్బు పెట్టి, ఈ సినిమాను ముందుకు తీసుకువెళ్లాడు'' అన్నారు నిర్మాత సతీష్. ''మా 'సోలో బాయ్' మధ్యతరగతి కుటుంబాలను ప్రతిబింబించే చిత్రం'' అన్నారు దర్శకుడు నవీన్. ''దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ కుటుంబం కోసం త్వరలో మ్యూజికల్ నైట్ నిర్వహించి, వచ్చే ఆదాయాన్ని వారి కుటుంబానికి అందజేయాలనుకుంటున్నాను'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్. ''మా కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించడం మాకెంతో గౌరవంగా ఉంది. గౌతమ్ మాట్లాడుతుంటే మా అబ్బాయి మాట్లాడుతున్నట్లే ఉంది'' అన్నారు మురళీ నాయక్ తల్లిదండ్రులు.

పది కోట్ల పాటలో...



● విరాట్ కర్ణ

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్‌ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. ''ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.